
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 5 ఫిబ్రవరి 2024

నిలిచేదెవరో.. గెలిచేదెవరో!



వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాల కోసం రెండు జిల్లాల్లో పలువురు రాజకీయ కుటుంబాల వారసులు రేసులో ఉన్నారు. వీరిలో ఇప్పటికే నలుగురు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా ఉండగా.. మరో ఐదుగురు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో వీరిలో ఎందరు ఆయా పార్టీల్లో టికెట్ సాధిస్తారో.. పోటీలో గెలిచి చట్టసభలో తొలిసారిగా అడుగుపెట్టి తమ కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ఎందరు నిలబెట్టుకుంటారోనన్న ఆసక్తి ప్రజానీకంలో ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రెండు జిల్లాల నుంచీ టికెట్ల రేసులో తొమ్మిది మంది వారసులు

తిరుపతి జిల్లా నుంచి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి, చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి, సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, మాజీ మంత్రి కుతూహలమ్మ సోదరి కుమారుడు రాజేష్, సూళ్లూరుపేటలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య, తిరుపతి లోక్‌సభ స్థానంలో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేర్లు టికెట్ల రేసులో ప్రధానంగా వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య, మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు హేమలత పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

ఇప్పటికే ఇన్‌చార్జులుగా నలుగురు

తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సత్యవేడులో రాజేష్.. ఈ ముగ్గురూ వైసీపీ తరఫున ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. వీరిలో మోహిత్ రెడ్డిని ఆ పార్టీ ఇదివరకే రానున్న ఎన్నికల అభ్యర్థిగా ప్రకటించేసింది కూడా. ఈ ముగ్గురికీ వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఖాయమనే చెప్పాలి. ఏవైనా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప వీరి పోటీలో మార్పులు ఉండకపోవచ్చు. ఒకవేళ అలాంటి పరిణామాలు తలెత్తితే దానికి సత్యవేడులోనే అవకాశం ఉంటుంది. టీడీపీ విషయానికొస్తే సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇప్పటికే ఇన్‌చార్జిగా ఉన్నారు. కాకపోతే అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం ఎదుట మరిన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ అభ్యర్థి ఎవరన్నది తేలాలంటే మరికొన్ని రోజులు నిరీక్షించక తప్పదు. ఈ నలుగురూ ప్రధాన పార్టీల ఇన్‌చార్జులుగా ఉన్నందున ఇతరులతో పోలిస్తే వీరి అవకాశాలు ప్రబలంగానే ఉండనున్నాయి. ఇక, అభినయ్‌రెడ్డి గెలుపు కోసం కరుణాకరరెడ్డిరాజకీయంగా సానుకూల పరిస్థితులు సృష్టించుకునే ప్రయత్నంలో కొంతకాలంగా బిజీగా ఉన్నారు. మోహిత్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి పంథాలోనే నిరంతరం జనం మధ్యే ఉంటున్నారు. సత్యవేడు వైసీపీకి రాజేష్ కొత్త వ్యక్తి. స్థానికేతరుడన్న ముద్ర పడుతోంది. పార్టీ శ్రేణులు ఎంతవరకూ అంగీకరిస్తాయన్నది చూడాలి. ఆదిమూలం అనుకూలవర్గం ఏం చేస్తుందనేది కూడా కీలకం కానుంది. అక్కడే టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ ఇతర ఆశావహులతో పోలిస్తే ఇప్పటికే నియోజకవర్గమంతా కలియదిరిగేశారు. జనం మధ్యకు వెళుతున్నారు. ఈ నలుగురి అదృష్టం ఎలా ఉందో వేచి చూడాలి.

టికెట్ రేసులో మరో ఐదుగురు

- తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి బీటెక్ చదివారు. వివాహమై ప్రస్తుతం హైదరాబాదులో నివాసముంటున్నారు. ఆమె భర్త కూడా అన్నమయ్య జిల్లాలో పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేయడం ద్వారా ఆమె రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పట్లో వైసీపీ నాయకులు అనుసరించిన దౌర్జన్యకర పద్ధతుల నడుమ గెలుపు సాధించలేకపోయారు. ఇపుడు టీడీపీ అసెంబ్లీ టికెట్ రేసులో ఉన్నారు. తనకు కాకపోతే మనవరాలికి టికెట్ ఇవ్వమని సుగుణమ్మ పట్టుబడుతున్నారు.
- రెండుమార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన పనబాక లక్ష్మి భర్త, ఐఆర్ఎస్ అధికారిగా రిటైరైన కృష్ణయ్య సూళ్లూరుపేట టికెట్ ఆశిస్తున్నారు. నిజానికి భార్యాభర్తలిద్దరూ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఆశించినప్పటికీ ఒక కుటుంబానికి ఒకే టికెట్ విధానాన్ని పార్టీ అనుసరిస్తున్నందున ఒకరికే అవకాశం దక్కే పరిస్థితి. దీంతో కృష్ణయ్య అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గ టీడీపీ వర్గాల్లో కూడా ఆయన పేరు ప్రచారంలో ఉంది.
- తిరుపతి లోక్‌సభ స్థానం నుంచీ టీడీపీ టికెట్ రేసులో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేరు వినిపిస్తోంది. మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అయిన ఆమె అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం. పార్టీ వర్గాల్లో అయితే దాదాపు ఆమె అభ్యర్థిత్వం ఖరారైపోయిందని, ప్రకటించడమే తరువాయి అన్న ప్రచారం నడుస్తోంది.
- చిత్తూరులో జనసేన టికెట్ రేసులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య పేరు వినిపిస్తోంది. ఆదికేశవులు పెద్ద కుమార్తె తేజస్విని కూతురైన చైతన్య శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గురవయ్య నాయుడు కుమారుడు రాజేష్‌ను వివాహం చేసుకున్నారు. తాత, నాన్నమ్మ రాజకీయ వారసురాలిగా చిత్తూరు నుంచీ జనసేన టికెట్ సాధించి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆమె గట్టిగా ప్రయత్నిస్తున్నారు. జనసేన అధిష్ఠానం కూడా ఆమె పేరును సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం.
- చిత్తూరులోనే టీడీపీ టికెట్ రేసులో మాజీ మేయర్ హేమలత పేరూ బలంగా వినిపిస్తోంది. ఆమె మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు. అనురాధ మృతితో కార్పొరేటరుగా గెలిచి మేయర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థలకు పరిమితమైన ఆమె రాజకీయ జీవితాన్ని ఇపుడు మరో మెట్టు పైకి చేర్చాలని యత్నిస్తున్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న ఆశావహుల్లో ఆమె కూడా ఒకరు.

- వైసీపీ కబంధహస్తాల నుంచి

రాష్ట్రాన్ని కాపాడేందుకు ‘రా.. కదలిరా’

- రేపటి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని అమర్ పిలుపు





సిద్ధమవుతున్న సభాప్రాంగణం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: ‘వైసీపీ ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి ఏపీని కాపాడాలి. దీనికోసం ప్రజలను చైతన్యపరిచి, రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రా.. కదలిరా పేరిట సభలు నిర్వహిస్తున్నారు’ అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి గంగాధరనెల్లూరు పంచాయతీ రామానాయుడు పల్లె వద్ద సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం నేతలతో కలిసి పరిశీలించిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాల్గొనే ఈ బహిరంగసభను రెండు లక్షల మందితో విజయవంతం చేయాలని నేతలు, కార్యకర్తలకు లక్ష్యంగా పెట్టామన్నారు. ఈ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలు, అవినీతి, అక్రమాల వల్ల రాష్ట్రానికి జరిగిన అన్యాయంతో పాటు యువతకు ఉపాధిలేకుండా చేయడంపై ఈ సభ ద్వారా ఎలుగెత్తి చాటనున్నట్లు చెప్పారు. తద్వారా ప్రజలు, యువతలో చైతన్యం వచ్చి ప్రభుత్వ అరాచకాలను అడ్డుకట్టవేయనున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, పరిశీలకుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, నేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, వై.వి.రాజేశ్వరి, నాగేశ్వరరాజు, హరిబాబు నాయుడు, రుద్రయ్యనాయుడు, చెంగల్రాయయాదవ్, లోకనాథరెడ్డి, మునిచంద్రారెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు.

సభకు ముమ్మర ఏర్పాట్లు

రా...కదలిరా సభా స్థలంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వేదికతో పాటు వీఐపీలు, మీడియా ప్రతినిధులు, ప్రజల పాల్గొనే గ్యాలరీల కోసం వేర్వేరుగా గ్రిల్స్, ఫ్లడ్‌లైట్లు, సౌండ్‌సిస్టమ్, ఏర్పాటుతో పాటు విద్యుత్‌తో పనిలేకుండా ప్రత్యేకంగా జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ఆదివారం ముఖ్య నాయకులు పరిశీలించారు.

రేపు చంద్రబాబు రాక

వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద మంగళవారం జరిగే ‘రా.. కదలిరా’ బహిరంగ సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన రామానాయుడుపల్లె హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడ్నుంచి 3 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగసభ జరుగుతుంది. అనంతరం 4.35 గంటలకు 4.45 రామానాయుడుపల్లె హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. 5.10 గంటలకు విమానంలో విజయవాడకు బయలుదేరుతారు.



నేతలతో కలిసి సభా వేదికను పరిశీలిస్తున్న అమర్, నాని, థామస్

ఎస్పీగా జాషువా బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఫిబ్రవరి 4: చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రిషాంత్ రెడ్డి నుంచి నూతన ఎస్పీగా పి.జాషువా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేశారు. రెండేళ్లుగా కృష్ణాజిల్లా ఎస్పీగా పనిచేసిన జాషువా బదిలీపై జిల్లాకు వచ్చారు. ఆయనకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది సాదరస్వాగతం పలికారు. అనంతరం ఉన్నతాధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్పీ జాషువా మీడియాతో మాట్లాడారు. త్వరలో జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ కృషిచేస్తుందన్నారు. 2011లో జిల్లాలో డీఎస్పీగా పనిచేసినందున తనకు కొంత అవగాహన ఉందన్నారు. మహిళలు, పేదల హక్కుల కోసం పనిచేస్తానన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. దీనికోసం త్వరలో పోలీసు అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికను రూపొందిస్తామన్నారు.




బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ

చిత్తూరు అడిషనల్‌ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్)గా అరీఫుల్లా ఆదివారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన పలమనేరు డీఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పదోన్నతి పొంది ఏఎస్పీగా తిరుపతి జిల్లా ఓఎస్డీగా, వైజాగ్‌లో ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు ఏఎస్పీగా వచ్చారు. అనంతరం ఎస్పీ జాషువాను కలిశారు. ఏఎస్పీకి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు.

గొల్లపల్లెలో ఒంటరి ఏనుగు

- కారుపై దాడి.. పంటల ధ్వంసం





గొల్లపల్లె సమీపంలో ఒంటరి ఏనుగు - ధ్వంసం చేసిన జొన్న పంట

శాంతిపురం, ఫిబ్రవరి 4: శాంతిపురం మండలం గొల్లపల్లె వద్ద ఒంటరి ఏనుగు ఆదివారం తెల్లవారుజామున హల్‌చల్ చేసింది. కర్ణాటక సరిహద్దు అటవీప్రాంతం నుంచి గుడుపల్లె మండలం దాటుకుంటూ శాంతిపురం మండలం కోనేరుకుప్పం మీదుగా గొల్లపల్లె సమీప పొలాల్లోకి చేరింది. కోనేరుకుప్పానికి చెందిన ఉమాశంకర్‌రెడ్డి తన కారులో రాళ్లబూదుగూరు నుంచి సొంతూరుకు వెళుతుండగా పిల్లిగానపల్లె సమీపంలో రోడ్డుపక్కన పొదల్లో ఉన్న ఏనుగు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చింది. దీంతో ఆయన కారును స్లో చేయగా.. కారు బంపర్ పట్టుకుని ఏనుగు లాగింది. కారులో ఉన్న ఉమాశంకర్‌రెడ్డి గట్టిగా హారన్ కొట్టడంతో వదిలి వెళ్లింది. అలాగే కోనేరుకుప్పానికి చెందిన ప్రసాద్ తన పొలం వద్ద తాడుతో కట్టి ఉంచిన ఆవుపైనా దాడికి యత్నించగా.. ఆవు తాడు తెంచుకుని పరుగులు పెట్టింది. గొల్లపల్లెకు చెందిన రామకృష్ణప్ప జొన్నతోటను ధ్వంసం చేసింది. జనం అధిక సంఖ్యలో చేరి కేకలు వేయడంతో వెంకటరెడ్డి మామిడి తోటలోకి వెళ్లింది. మామిడితోటకు వేసిన కంచెను ధ్వంసం చేసింది. డీఆర్వో పుల్లయ్య తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగును కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు మళ్లించారు.




ఏనుగులు దాడిలో ధ్వంసమైన కారు


ఏనుగు దాడిలో రైతుకు గాయాలు




గుడుపల్లె: గుడుపల్లె మండలం అత్తినత్తం గ్రామానికి చెందిన రైతు వెంకటాచలం(34)పై ఆదివారం ఉదయం ఒంటరి ఏనుగు దాడి చేసింది. తన పొలంలో పంటకు నీరు పెట్టడానికి వెళ్తున్న ఆయనపై మార్గమధ్యంలో ఏనుగు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంకటాచలం కేకలు విని స్థానికులు అక్కడకు చేరుకొన్నారు. 108 వాహనంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజి ఆసుపత్రి తరలించారు.

ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులే


449 TVF0543835
1-123
36


332 TVF1850064
1-118
80

ఓటరు జాబితాలో మృతిచెందిన పి.అమరనాథ్, చెంగమ్మ పేర్లు


69 TVF0971490
1-30
54

స్థానికేతురాలైన సరస్వతికి ఓటు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 4: ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులు వెలుగు చూస్తున్నాయి. రొంపిచెర్ల మండలం బండకిందపల్లె పంచాయతీలో బూత్ నెంబరు 220లో చనిపోయినా, వివాహమై అత్తారింటికి వెళ్లిన వారికీ ఓట్లున్నాయి. 11 మంది చనిపోయిన వారు, 9 మంది వివాహమై అత్తారింటికి వెళ్లినవారు, ఇతర ప్రాంతాల్లోని నలుగురికి, ఇద్దరు డబుల్ ఎంట్రీలు ఉన్నట్లు టీడీపీ నేతలు గుర్తించారు. అధికారులకు తెలిపినా పటించుకోక మునాయిదా ఓటర్ల జాబితాలోని తప్పులు అలానే ఉన్నాయంటూ ఆరోపిస్తున్నారు.

10 నుంచి ఇన్‌స్పైర్ మనక్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 4: జిల్లాలోని పాఠశాలల్లో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు ఇన్‌స్పైర్ ఇన్‌సైర్ మనక్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈవో విజయేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 417 ప్రాజెక్టులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నిర్వహించే పోటీలకు గైడ్‌లు, విద్యార్థులు ఎంపిక చేసుకున్న నమూనాలను ప్రదర్శనకు సిద్ధం చేయాలన్నారు.

రేపటి అసెంబ్లీ ముట్టడికి సర్పంచులు తరలిరావాలి

బంగారుపాళ్యం: విజయవాడలో బుధవారం జరిగే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పార్టీలకతీతంగా సర్పంచులు తరలిరావాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్,రాష్ట్ర సర్పంచులసంఘం కార్యదర్శి కుప్పాల మురళి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మన విధులు- నిధులు- అధికారం కోసం పోరాడదామని వారు పేర్కొన్నారు.

తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డిపై ఈసీకి ఫిర్యాదు చేశాం: చల్లా

పుంగనూరు, ఫిబ్రవరి 4: వైసీపీకి అనుకూలంగా, మంత్రి పెద్దిరెడ్డికి తొత్తుగా ఉంటూ రాజంపేట నుంచి పుంగనూరుకు వస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి బదిలీని రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పుంగనూరులో తహసీల్దార్‌గా పని చేసిన సుబ్రహ్మణ్యంరెడ్డిపై వివిధ ఆరోపణలున్నాయన్నారు. దొంగఓట్లు వేయించడం, వైసీపీకి అనుకూలంగా పనిచేశారని విమర్శించారు. అలాగే ఉపఎన్నికల సమయంలో దొంగఓట్లు వేయించి ఏకపక్షంగా వ్యవహరించి టీడీపీ వారిని ఇబ్బందులు పెట్టే ఆయన్ను పుంగనూరుకు రానీయకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని వివరించారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డిని ఇంటికి పంపడం ఖాయమని, టీడీపీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు.




పాతగుంట జల్లికట్టు అల్లిలో జనం - గిత్తను పట్టుకుంటున్న యువకులు

రంకేసిన గిత్తలు

పాతగుంట, సింగపూరిండ్లలో జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4: వెదురుకుప్పం మండలం పాతగుంట, సింగపూరిండ్ల(ఎం.వేణుగోపాలపురం)లో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. అధిక సంఖ్యలో జనం తరలి రావడంతో ఆయా గ్రామాలు జనసంద్రంగా మారాయి. పలు ప్రాంతాల నుంచి పశువులను తీసుకొచ్చిన యజమానులు.. వాటి కొమ్ములకు బహుమతులుగా పట్టీలను కట్టి అల్లిలోకి వదిలారు. వీటిని పట్టుకునే క్రమంలో యువకులు కింద పడ్డారు. కొందరు గాయపడ్డారు. కొందరు గిత్తలను పట్టుకుని పట్టీలను సొంతం చేసుకున్నారు.

రాళ్లబూదుగూరులో ఎద్దుల పండగ

శాంతిపురం: శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో ఆదివారం పశువుల పండగ జరిగింది. ఎద్దులకు కవల్లు కట్టి బారికేడ్ల మధ్య ప్రధాన వీధుల్లో పరిగెత్తించారు. ఎద్దులకు కట్టిన టవళ్లను విప్పుకొనేందుకు యువకులు పోటీపడ్డారు. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాల నుంచీ రైతులు తమ పశువులను తీసుకొచ్చారు. ఇక, ఎద్దుల పండుగను తిలకించడానికి భారీగా తరలివచ్చిన వారితో గ్రామం జనసంద్రంగా మారింది.



కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4: కాణిపాకం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు కాణిపాకానికి విచ్చేయడంతో ఆలయం పూర్తిగా నిండి పోయింది. దీంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధిగా గోవర్ధన్ రెడ్డి



కార్వేటినగరం,ఫిబ్రవరి4:కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేటకు చెందిన ఎం.గోవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధిగా నియమించారు. కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి తనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ఆయన ఆదివారం చెప్పారు.

మినీ లారీ, లగేజీ వ్యాన్ ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు




ప్రమాదానికి గురైన వాహనాలు - స్టీరింగ్‌కు ఇరుక్కున్న క్షతగాత్రుడు - చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

చిత్తూరు, ఫిబ్రవరి 4: మినీ లారీ, లగేజీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్ఐ బాబు తెలిపిన ప్రకారం.. పలమనేరు, గంగవరం మండలాలకు చెందిన అహ్మద్ బాషా, రషీద్ అహ్మద్, అస్లాం బాషా లగేజీ వ్యాన్‌లో పలమనేరు నుంచి చిత్తూరుకు బయలుదేరింది. తమిళనాడుకు చెందిన మినీలారీ పలమనేరుకు వెళ్లే క్రమంలో పలమనేరురోడ్డులోని చర్చి వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అహ్మద్ బాషా, రషీద్ అహ్మద్, అస్లాం బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిమ్మనపల్లె వైపు మళ్లిన జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 4: సోమల మండలంలో రైతుల కంట కన్నీరు తెప్పించిన జంట ఏనుగులు ఆదివారం నిమ్మనపల్లె మండలం బాలేపల్లెవైపు వెళ్లినట్లు సర్పంచు సురేంద్రరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా ఇరికిపెంట, మేటిమంద, నడింపల్లె, తమ్మినాయనపల్లె, పేగలవారిపల్లె గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో పలు పంటలను ధ్వంసం చేశాయి. ఈక్రమంలోనే సురేంద్రరెడ్డి చొరవ తీసుకుని రైతులు వెంట రాగా అటవీ క్షేత్ర సిబ్బందితో కలసి టపాసులు పేల్చుతూ, డప్పులు వాయిస్తూ ఏనుగుల వెంట పరుగులు తీశారు. ఎట్టకేలకు అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె వైపు దారి మళ్లించారు.

ఆన్‌లైన్ గేమ్‌లో ఘర్షణ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4: సెల్‌ఫోన్‌ల్లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ రెండు వర్గాల యువకులు ఘర్షణ పడి గాయపడడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గౌరీశంకర్ తెలిపారు. మంగళం పంచాయతీ బాగేపల్లెకు చెందిన చిరంజీవి, రవికుమార్, ప్రసాద్, కల్యాణ్, రాజేశ్, భరత్ ఒక వైపు.. మరో పక్క రమణ, విశాక్, కార్తీక్, అశోక్, నాగ, అనిల్ కలసి సెల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ ఘర్షణ పడినట్లు తెలిపారు. చిరంజీవి వర్గీయులపై రమణ వర్గీయులు దాడి చేయగా చిరంజీవి గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నత్తంకండ్రిగలో వ్యక్తి హత్య

● కత్తితో దాడి చేసిన దుండగుడు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



జగదీష్ నాయుడు మృతదేహం

నగరి, ఫిబ్రవరి 4: నగరి మండలం నత్తం కండ్రిగకు చెందిన జగదీష్ నాయుడు(34) శనివారం రాత్రి హత్యకు గురయ్యారు. సీఐ సురేష్ నాయుడు తెలిపిన ప్రకారం.. శనివారం రాత్రి తన ఇంటి వద్ద ఉన్న జగదీష్‌పై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆయన్ను స్థానికుల సాయంతో కుటుంబీకులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని నగరి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆదివారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు నగరి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్టీ కాలనీలోని ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆ మహిళ విడాకులకు కోర్టుకు వెళ్లారని అంటున్నారు. ఎలాగైనా చంపేస్తానని ఆ మహిళ భర్త పలుసార్లు బెదిరించడంతో జగదీష్ తన ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు అతడి బంధువులు చెప్పారు. ఈ క్రమంలో ఆ మహిళ భర్తే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

రోజా అనుచరుడిపై దాడి ఘటనలో ముగ్గురి అరెస్టు

నగరి, ఫిబ్రవరి 4: మంత్రి ఆర్కే రోజా ప్రధాన అనుచరుడు ప్రత్యూష్‌పై తిరుత్తణిలో జరిగిన దాడికి సంబంధించి టీడీపీకి చెందిన నవీన్, చిరంజీవి, మధుఅలియాస్ పరశురామ్‌ను అక్కడి పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. పరారీలో ఉన్న చిట్టిబాబు కోసం గాలిస్తున్నారు.



క్యూలైన్లలో వేచియున్న భక్తులు - వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్



బోయకొండ కిటకిట

చౌడేపల్లె, ఫిబ్రవరి 4: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 40వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు కొండకు రావడంతో కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో ఉన్న రణభేరి గంగమ్మ ఆలయం నుంచి కొండపై ఉన్న కార్యాలయం వరకు ట్రాఫిక్ స్తంభించింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్ర మౌళి పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలి : టీఎన్‌టీయూసీ

కుప్పంలో ముగిసిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర

కుప్పం, ఫిబ్రవరి 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేసి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘు రామరాజు అన్నారు. జనవరి 6న ప్రారంభమైన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను కుప్పంలో ముగించారు. ఆదివారం కుప్పం చేరుకున్న యాత్రకు స్థానిక టీడీపీ నేతలు స్వాగతం పలికారు. బస్సు యాత్ర బృందంతో కలసి కుప్పం పట్టణంలో పర్యటించారు. కుప్పం పూలమండీలలో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆపై కుప్పం టీడీపీ కార్యాలయంలో బృందాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కార్మికులందరూ కడుపునిండుగా అన్నం తినేవాళ్ళన్నారు. అదే నేడు కార్మిక లోకం భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ పాలనలో ఎన్నో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తెచ్చి చేతినిండా పనులు కల్పించారన్నారు. నాడు కార్మికులకు స్వర్ణ యుగం నడిస్తే, నేడు వైసీపీ పాలనలో రాతి యుగం నడుస్తోందన్నారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కుప్పంలో 33 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నేతలు ఫణేశ్వర్‌రావు, పరుచూరి ప్రసాద్, మల్లికార్జునరావు, శివాజీ, హమాలీ సంఘ నాయకులు లింగంపల్లె మోహన్‌రావు, సూర్య, మాధవనాయుడు, రాజ్‌కుమార్, టీడీపీ నేతలు పీఎస్.మునిరత్నం, సత్యేంద్రశేఖర్, గోపినాథ్, వెంకటేష్, సుగుణాకర్, శ్రీకాంత్ జనసేన నేతలు నవీన్, రజేష్ తదితరులు ఉన్నారు.



టీఎన్‌టీయూసీ టీంను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

కె.సభా సంకలనాలను అందిస్తే పుస్తకాలుగా ప్రచురిస్తాం

కె.సభా శత జయంత్యుత్సవాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 4: నాటి సంస్కృతి, సాంఘికత్వం, జీవన విధానానికి తన రచనల్లో కె.సభా రూపురేఖలు కల్పించి జిల్లా ఖ్యాతిని చాటారని కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, సంపాదకుడు, ప్రచురణకర్త కె.సభా శత జయంత్యుత్సవాలను నిర్వహించడం కేంద్ర సాహిత్య అకాడమీకి మణిహారం లాంటిదన్నారు. చిత్తూరులోని కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవన్‌లో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కె.సభా శత జయంత్యుత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆయన సాహిత్య సంకలనాలను సేకరించి అకాడమీకి అందజేస్తే, వాటిని పుస్తకాలుగా ప్రచురిస్తామని చెప్పారు. సభా రచనల పట్ల పరిశోధనలు చేసే వారికి అకాడమీ ఆర్థిక సహకారం అందిస్తుందని ఆమె తెలిపారు. రాయలసీమ తొలి కథా రచయితగా పేరు పొందిన కె.సభా.. సామాజిక, ఆర్థిక, సాంఘిక అంశాలను తనదైన రీతిలో, తగు మాండలీకాల్లో రచించి వన్నె తెచ్చారని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆయన 290కి పైగా కథలు రాస్తే కేవలం 40 మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. సభా పుట్టిన రోజే ఆయన కుమారుడు రమణ వర్ధంతి రోజు కూడా కావడం బాధాకరమని కిరణ్ క్రాంత్ చౌదరి పేర్కొన్నారు. నీటి దీపాలు, బంగారమ్మ కథల్లో ఇరుగు పొరుగు సంభాషణలను అతి చక్కగా, సరళమైన భాషలో రచించారని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖాధిపతి రాజేశ్వరమ్మ వివరించారు. చిన్నారుల మానసిక వికాసానికి, విజ్ఞానికి రచనలు చేసి మెప్పించిన రచయితల్లో మొదటి వారి సభా అని నేషనల్ బుక్ ట్రస్టు సభ్యుడు పత్తిపాటి మోహన్ అన్నారు. పలమనేరు బాలాజి మాట్లాడుతూ.. సభా కవితలు ఎంతో సరళమైన పదాలతో ఉండి అన్నీ వర్గాల వారిని ఆలోచింప చేస్తాయన్నారు. జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఎంఆర్ అరుణకుమారి, ఉర్దూ రచయిత కాసీం అలీ ఖాన్, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డాక్టర్ కె. రామలక్ష్మి, కె.వేణుగోపాల్, పసతల హరికృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త అశోక్ కుమార్ తమ ప్రసంగాల్లో సభా సాహితీ సేవలను కొనియాడారు. సభా కుటుంబ సభ్యులను నిర్వాహకులు సన్మానించారు. రచయిత్రి మృణాళిని కూడా సత్కరించారు.



రచయిత్రి మృణాళినిని సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం, నిర్వాహకులు

సొసైటీల్లో కమిటీల పాలనే

● మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
● ఐదేళ్లుగా ఎన్నికలకు చొరవ చూపని ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4: రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా, సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (సింగిల్ విండోలు) కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వ పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ చూపడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశపెట్టింది. ప్రతి ఆరు నెలలకు ఓసారి ఈ కమిటీల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ వస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలోని 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీల పదవీకాలం జనవరి 31వ తేదీతో ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి జూలై 31 వరకు ఆ కమిటీల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే త్రిసభ్య కమిటీల సభ్యుల నియామకాలను సహకారశాఖ చేస్తోంది. కాగా, ప్రస్తుతం ఐరాల కమిటీ చైర్మన్‌ను మార్పు చేసింది. రాజకీయాలకు అతీతంగా సింగిల్ విండోలు పనిచేయాల్సివుండగా, మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటోంది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోయారు.

2013లో సహకార ఎన్నికలు

సింగిల్ విండోలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు జరుగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీకాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఉంటాయని అందరూ భావించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాను కూడా అధికారులు సిద్ధం చేశారు. రూ.10 నుంచి రూ.300 వరకు చెల్లించిన ఓటర్ల సంఖ్య సుమారు ఐదు లక్షలకు పైగా ఉంది. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించినా.. ఆ తర్వాత చొరవ చూపలేదు. అందుకు బదులుగా త్రిసభ్య కమిటీల పాలనను సింగిల్ విండోల్లో ప్రవేశపెట్టింది. ఎన్నికలు లేకపోవడంతో కొన్ని సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీలు అక్రమాలకు తెరతీశాయన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

ఉభయదారులను నిర్లక్ష్యం చేయొద్దు



మణికంఠేశ్వర స్వామి ఆలయంలో సమావేశమైన ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులను నిర్లక్ష్యం చేయొద్దని ఉభయదారులు తెలిపారు. ఆదివారం ప్రధాన ఆలయానికి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వీరు సమావేశమయ్యారు. ఆలయం దేవదాయ శాఖకు వెళ్లకముందు నుంచి అభివృద్ధికి ఉభయదారులు ఎంతో శ్రమించారన్నారు. ఆలయం వద్ద వినాయక స్వామి చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించిన సమయంలో ఉభయదారులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి ఏ విషయమైనా ఉభయదారులకు తెలియజేయాలని కోరారు. తమను నిర్లక్ష్యం చేస్తే ధర్నా, నిరసన చేపడతామని అధికారులను హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

చిత్తూరు, ఫిబ్రవరి 4: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం స్పందన సందర్భంగా వినతులు స్వీకరిస్తామని ఎస్పీ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు వినతిపత్రాలను అందించవచ్చని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు : డీసీసీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ శవాన్ని మోస్తున్న ఆ నలుగురు అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు. ఆదివారం వెదురుకుప్పంలో ఆయన మాట్లాడుతూ.. పెద్దిరెడ్డిలాంటి ఎంతో మందికి రాజకీయభిక్ష పెట్టిన పార్టీ కాంగ్రెస్సేనని గుర్తు చేశారు. అలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి పదవి కోసం వైఎస్ ప్రమాద మరణాన్ని అడ్డంగా పెట్టుకుని అధికారంలోకి వచ్చింది మీరు కాదా అని ఆయన ప్రశ్నించారు. షర్మిలరెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని జీర్ణించుకోలేకుండా మతి భ్రమించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ వ్యాఖ్యలను పెద్దిరెడ్డి వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. మీ పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుకు మీరే ఫెయిల్ మార్కులు వేసి మీ ఓటమిని మీరే అంగీకరిస్తున్నారని ఎద్దేవా చేశారు. సంబరాల రాంబాబూ నీ ప్రేలాపనలు ఆపు.. ఇక చాలు అంటూ మంత్రి అంబటి రాంబాబుపై ఆయన మండిపడ్డారు. కోతికి కొబ్బరి చిప్ప లేక కుక్క నోటికి కొబ్బరికాయో రాబోయే ఎన్నికల్లో ప్రజలు తేలుస్తారన్నారు.

అడవి మీ అబ్బసొత్తా?

● ఇసుక దందాను అడ్డుకున్న వారిపై ఎంపీటీసీ జులుం
● దౌర్జన్యంగా ఇసుక ట్రాక్టర్లను తీసుకెళ్లిన వైనం

రామకుప్పం, ఫిబ్రవరి 4: రామకుప్పం మండలం గడ్డూరు యానాదికాలనీ అటవీ ప్రాంతంలో ఇసుక దందాను శనివారం అర్ధరాత్రి పలుగ్రామాల ప్రజలు అడ్డుకోవడంతో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ జులుం ప్రదర్శించారు. 'అడవి మీ అబ్బ సొత్తా' అంటూ వారిపై విరుచుకుపడ్డారు. అటవీ అధికారుల సమక్షంలోనే ట్రాక్టర్లను తీసుకెళ్ళిపోయారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గడ్డూరుయానాది కాలనీ అటవీప్రాంతంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఇసుక దందాను యానాదికాలనీ, గోవిందరాజపురం, వినాయకపురం గ్రామస్థులు శనివారం రాత్రి అడ్డుకున్న విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అక్కడకు చేరుకున్నారు. ఇసుక దందాకు అటవీ అధికారులు కొమ్ముకాస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహించారు. ఇసుక అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేయాలని డిమాండు చేశారు. ట్రాక్టర్లను ననియాల ఎలిఫెంటు క్యాంపునకు తరలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి కేసులు నమోదు చేస్తామని వారు చెప్పారు. ఇలా గంటపాటు వాదోపవాదాలు జరిగాయి. రాత్రి 11 గంటలకు 89పెద్దూరు ఎంపీటీసీ వెంకటరమణ తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. ట్రాక్టర్లను అడ్డుకున్న వారిపై విరుచుకుపడ్డారు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేందుకు మీరెవరంటూ దురుసుగా ప్రవర్తించారు. తన అనుచరులతో వారిపై దాడికి పాల్పడ్డారు. అటవీ అధికారుల సమక్షంలోనే ట్రాక్టర్లను అక్కడ్నుంచి తరలించేశారు. కాగా, ఇసుక దందాను అడ్డుకున్న వారిని ఎంపీటీసీ వెంకటరమణ బెదిరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఉద్రిక్త పరిస్థితులతో వచ్చేశాం

శనివారం అర్ధరాత్రి గడ్డూరు యానాదికాలనీ అటవీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో తాము వెళ్లామని ముద్దనపల్లె అటవీ బీట్ అధికారి మున్నా ఆదివారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణాదారులు, ప్రజల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగి.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో వచ్చేశామన్నారు. అక్రమ రవాణాదారులు తీసుకెళ్ళిన ఇసుక ట్రాక్టర్ల కోసం గాలిస్తున్నామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు తాము సహకరిస్తున్నామన్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

భయం, ఒత్తిడి వదిలేస్తే 'పది'లో ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నేతలు

శాంతిపురం, ఫిబ్రవరి 4 : పదో తరగతి పరీక్షల్లో భయం, ఒత్తిడి వదిలేస్తే ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తొలిసినాయనపల్లె వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో పదఒతరగతి విద్యార్థులకు విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 440మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలు ఎలా రాయాలి, ఏ విధంగా రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చో అవగాహన కల్పించారు. తరువాత విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లత, వెంకటయ్య, నగేష్, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్‌క్లబ్ సేవలు అందరికీ ఆదర్శం



సమావేశంలో ప్రసంగిస్తున్న మహమ్మదాలీ

కల్లూరు, ఫిబ్రవరి 4: కల్లూరు లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అందరికీ అదర్శమని లయన్స్‌క్లబ్ గవర్నర్ రామరాజ ఆర్స్ తెలిపారు. బెంగుళూరు నగరంలో ఆదివారం లయన్స్‌క్లబ్ కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్లూరు లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ గవర్నర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాభివృద్ధికి కల్లూరు లయన్స్‌క్లబ్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలు మరింత విస్తృతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ, మాజీ గవర్నర్ వినూత ప్రకాష్, ఉపాధ్యక్షులు ఆశ్వత్‌నారాయణ, చంద్రారెడ్డి, పరేశ్ సేథ్ పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్



రొంపిచెర్ల విద్యార్థులు వృత్తి విద్యపై అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 4: వృత్తివిద్యా కోర్సుల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ అన్నారు. ఆదివారం రొంపిచెర్లలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈ రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేడు అన్ని రంగాలకు విద్యుత్ వినియోగం అవశ్యకత వుందన్నారు. విద్యుత్ వాడకాలు, ఉత్పత్తులు, పొదుపు గురించి వివరించారు కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ మీనాకుమారి, అభ్యాసకులు వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దక్షిణ భారత హిందీ ప్రచారసభ సభ్యుడిగా ఎల్బీ మహేశ్‌నారాయణ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి4: దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఉమ్మడి రాష్ట్రాల కార్యవర్గ సభ్యుడిగా పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎల్బీ మహేశ్ నారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన దక్షిణభారత హిందీ ప్రచార సభ్యుల సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. అందులో 18మంది కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేయగా అందులో తనకు అవకాశం లభించిందన్నారు. విషయం తెలుసుకున్న పుంగనూరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వైసీపీ అరాచక పాలనకు అంతిమ ఘడియలు



టీడీపీలో చేరిన వారితో రూరల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప్పంరూరల్, ఫిబ్రవరి4: వైసీపీ అరాచక పాలనకు అంతిమ ఘడియలు సమీపించా యని కుప్పం రూరల్ టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మిట్టపల్లెలో జరిగిన టీడీపీ యువత సమావేశంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మిట్టపల్లె నుంచి షణ్ముగం, అభిలాస్, దౌలత్‌బాషా, షరీఫ్, పృథ్వీరాజ్, ఆడమండ్లకుప్పం నుంచి దేవేంద్రన్ మూర్తి, కేశవ్, కృష్ణప్ప, జయకుమార్, కుమార్ తదితరులు టీడీపీలో చేరగా వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా చంద్రబాబుకు అత్యధిక మెజారిటీ అందించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మురళి, గోపి, జయరాంనాయుడు, మంజునాథ్, లీలావెంకటేష్, చలపతి, రఘుపతి, రంగనాథ్, ఇమ్రాన్, కనకరాజ్ తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ఛైర్‌పర్సన్ పవిత్రను సన్మానిస్తున్న నాయకులు

వి.కోట,ఫిబ్రవరి4:విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర విశ్వబ్రాహ్మణుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పవిత్ర అన్నారు. ఆదివారం వి.కోటకు చేరుకున్న ఆమెకు వి.కోట విశ్వకర్మ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. పట్టణంలోని గంగమాంబ ఆలయం వద్ద వారిని సన్మానించారు. కార్యక్రమంలో మండల విశ్వకర్మ సంఘం నేతలు తిప్పరత్నాచారి, సురేష్‌ఆచారి, కుమార్ ఆచారి, నాగరాజ్, చంద్రాచారి, శీనాచారి, వెంకట్రామాచారి, గోవిందాచారి తదితరులు ఉన్నారు.

డీఎస్పీగా రాజగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఫిబ్రవరి 4: చిత్తూరు సబ్‌డివిజన్ డీఎస్పీగా ఎం. రాజగోపాల్ రెడ్డి ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా రేవనూరు గ్రామానికి చెందిన ఈయన 1991 బ్యాచ్‌లో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. మొదటి పోస్టింగు లోనే చిత్తూరుజిల్లాలో పనిచేశారు. ఎస్ఐగా పలు చోట్ల పనిచేసి, సీఐగా పదోన్నతి పొంది కుప్పం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విధులు నిర్వహించారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొంది రాయలసీమ జిల్లాలోని నాయుడుపేట, గూడూరులలో విధులు నిర్వహించి, బదిలీల్లో భాగంగా చిత్తూరు డీఎస్పీగా వచ్చారు. అనంతరం ఎస్పీ జాషువా, ఏఎస్పీ అరీఫుల్లాలను మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలేటమ్మకు విశేష పూజలు

సోమల : నెల్లిమందలోని పాలేటమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిపారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి అభిషేకపూజలు, జంతుబలిదానం జరిపారు. కాగా టమోటా సీజన్ ప్రారంభం కావడంతో రైతులు అమ్మవారి ఆలయంలో పూజలు జరిపి తీర్థాలను పొలాల్లో చల్లడం ఆనవాయితి.

మరో రెండు నెలల్లో మంచిరోజులు

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు



కూరగాయల బండి తోస్తూ ప్రచారం చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 4: రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ విజయంతో పుంగనూరు ప్రజలకు మంచిరోజులు వచ్చి అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పుంగనూరులోని హనుమంతరాయ దిన్నె, ప్రకాశంకాలనీ, టీడీకాలనీ, రామ్‌నగర్‌కాలనీ, ఎన్‌ఎస్‌పేట తదితర ప్రాంతాల్లో టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఆయన ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పట్టించుకోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మండిపడ్డారు. ప్రజల వద్దకు వెళితే తాగునీరు, రోడ్డు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యలు పట్టని మంత్రి ప్రజల్లో ఎలా తిరుగుతారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, రాష్ట్రానికి కాబోవు సీఎం చంద్రబాబు అని ధీమా వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎన్‌ఎస్‌పేటకు చెందిన వైసీపీ నాయకులు రమణ, మోహన్, ఈశ్వర్, రామకృష్ణ, మల్లి, వేణు, బాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు న్యాయవాది బి. వెంకటముని యాదవ్, దినేశ్, ఆసూరి బాలాజీ, సుహేల్‌బాషా. సుబ్రహ్మణ్యంరాజు, దేశాది ప్రకాశ్, ఖలీల్, సద్దాంహుస్సేన్, డీకే శ్రీనివాసులు, బసన్న, రామయ్య, రమణ, రెడ్డెప్పనాయుడు, కిరణ్, జనసేన నాయకులు చిన్నారాయల్, సురేశ్‌రాయల్, చైతన్యరాయల్, విరూపాక్షి, బాలాజీ నాయక్, హరినాయక్, పాముల హరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అక్రమాలు, అరాచకాలు : టీడీపీ



వీర్నమలలో మాట్లాడుతున్న టీడీపీ నేత ఆనందరెడ్డి

రామకుప్పం, ఫిబ్రవరి 4: వైసీపీ పాలకులు అభివృద్ధిని గాలికొదిలేసి అక్రమాలు, అరాచకాలతో పెట్రేగిపోతున్నారని టీడీపీ మండల ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం వీర్నమలలో జరిగిన గ్రామ వికాస సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ గ్రామంలో చూసినా టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధే కన్పిస్తోందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైసీపీ పాలకుల అరాచకాలను ప్రశ్నించిన వారిపై కక్షతో అక్రమ కేసులు బనాయించి, వేధిస్తున్నారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్నా, ప్రశాంత వాతావరణం నెలకొనాలన్నా తిరిగి టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. సమావేశంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయక్, జేయి. భూపతి, నందారెడ్డి, టీవీరవి, రఘు, మురళీ, పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

యువత బతుకులు బాగుపడాలంటే టీడీపీని గెలిపించాలి



తెలుగయువత సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

రామకుప్పం, ఫిబ్రవరి 4: యువత బతుకులు బాగుపడాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీని గెలిపించాలని తెలుగుయువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, బీసీసెల్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి వెంకటరమణ కోరారు. ఆదివారం రామకుప్పం, రాజుపేట, భైపరెడ్లపల్లె, చెల్దిగానిపల్లె, కొంగనపల్లెల్లో జరిగిన తెలుగుయువత సమావేశాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ పెద్దలు ఎన్నికలకు ముందు యువతకు ఎన్నో హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించారాన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరవై యువత వలస బాట పడుతున్నా పాలకుల్లో చలనం లేదని విమర్శించారు. ఆయా సమావేశాల్లో తెలుగుయువత పంచాయతీ అధ్యక్షులు రెడ్డిపురుషోత్తం, అవినాశ్‌రెడ్డి, శశికుమార్, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, నేతలు చిన్నసురేష్, సతీష్, మంజునాథ్, శ్రీకాంత్, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీల పోరాటం అమోఘం



కుప్పంలో జరిగిన అభినందన సభలో పాల్గొన్న అంగన్వాడీలు

కుప్పం, ఫిబ్రవరి 4: తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై అంగన్వాడీలు 42 రోజులపాటు చేసిన పోరాటం అమోఘమని యూనియన్ గౌరవాధ్యక్షుడు గంగరాజు అన్నారు. ఆదివారం కుప్పం ప్రాజెక్టు అంగన్వాడీలతో అభినందన సభ ఏర్పాటు చేసి సభ్యుల పోరాటాన్ని ప్రశంసించారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా, కేంద్రాల తాళాలు పగుల గొట్టినా, షోకాజ్ నోటీసులు ఇచ్చినా, టెర్మినేషన్ అన్నా ఎలాంటి బెదిరింపులకు బెదరకుండా అంగన్వాడీలు జరిపిన సమ్మె చరిత్రలో నిలిచిందన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో క్రియాశీలకంగా వ్యవహరించి ప్రాణత్యాగాలకు సిద్ధంకావడంతోనే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. అబద్ధపు ప్రచారాలతో కొంతమంది సమ్మెను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నినా మొక్కవోని దీక్షతో ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేసిన పోరాటంలో కలసి వచ్చిన వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుప్పం సెగ్మెంట్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శిగా సరళ, గౌరవ అధ్యక్షురాలిగా ప్రమీళతోపాటు 18మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గంగరాజు, లలిత, ప్రమీళ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే 'మానవత' ధ్యేయం



మాట్లాడుతున్న మానవత సేవా సంస్థ ఛైర్మన్ నందీశ్వరయ్య

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి4: పేదలకు సేవ చేయడమే మానవతా స్వచ్ఛందసేవా సంస్థ ధ్యేయమని సంస్థ ఛైర్మన్ నందీశ్వరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగ భవన్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంస్థకు ఫ్రీజర్ బాక్స్‌లు, వైకుంఠ రథం నిల్వ చేసుకోవడానికి భూమి కేటాయించినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 8న పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి ఏసీ నారాయణరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే పుంగనూరులో రొమ్ముక్యాన్సర్ బాధిత మహిళల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు నరసింహారెడ్డి, మునిస్వామినాయుడు, రామనాథం, భక్తవత్సలం, రాజా, రెడ్డెప్పరెడ్డియాదవ్, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేశ్ మొదలియార్, హరినాథరెడ్డి, అనీల్‌కుమార్, చెంగారెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం

మాజీ మంత్రి అమరనాథరెడ్డి





పలమనేరులో జయహో బీసీ ర్యాలీ, ప్రసంగిస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి4 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పలమనేరులో జయహో బీసీ కార్యక్రమంలో బీసీ నాయకులు, బీసీలు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంలోనే స్వర్గీయ ఎన్టీ రామారావు బలహీన వర్గాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆనాడు బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే దాన్ని ప్రస్తుత ప్రభుత్వం 24 శాతానికి కుదించిందన్నారు. బీసీల కార్పొరేషన్లు పెట్టి ఒకపైసా నిధులు కూడా ఇవ్వలేదన్నారు. కనీసం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత కూడా తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా కులవృత్తుల వారి కోసం తీసుకొచ్చిన పనిముట్లు కొన్ని గతంలో పంపిణీ చేయగా ప్రస్తుతం గోడౌన్లలో మగ్గుతూ తుప్పు పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దంపూరి భాస్కర్‌యాదవ్, సుబ్రమణ్యం గౌడు, చాంద్‌బాషా, జయహో బీసీ ఇన్‌చార్జీ వెంకటేష్‌యాదవ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ పరిశీలకులు జయప్రకాష్, పలమనేరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి, పలమనేరు నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు నాగభూషణం, స్వతంత్రబాబు, శ్రీనివాసులు, గిరి, పలమనేరు పట్టణ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరి,ఖాజా, నాగరాజు, మండల పార్టీ నాయకులు నాగరాజరెడ్డి, గణేష్, ,సెల్వ, పెద్దబ్బ, వెంకటమునిరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభను జయప్రదం చేయండి

వి.కోట, ఫిబ్రవరి4: గంగాధర నెల్లూరులో జరగనున్న రా..కదలిరా..సభను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం వి.కోట టీడీపీ కార్యాలయంలో మండల నాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి దిగ్విజయం చేయాలని కోరారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, నేతలు విశ్వనాథ్, హరినాథరెడ్డి, ధీరజ్, కోదండ, నారాయణస్వామి, రాము, ముకుంద, విశ్వనాథరెడ్డి, నాసీర్, షేక్ ఉమ్మర్ తదితరులు ఉన్నారు.

95 మందికి నేత్ర పరీక్షలు



పలమనేరు, ఫిబ్రవరి4 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 95 మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. చెన్నై శంకరనేత్రాలయ నేత్రవైద్యుడు మురళి పరీక్షలు నిర్వహించి 41 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని, చెన్నై వెళ్లి రావడానికి కూడా వాహన సౌకర్యం కల్పిస్తామని డాక్టరు మురళి తెలిపారు.

వీధికుక్కల వీరంగం : ఆవుకు గాయాలు

సోమల, ఫిబ్రవరి 4: సోమల - కందూరు మార్గంలోని పద్మశ్రీ టాకీస్ క్రాస్ రోడ్డు వద్ద వీధి కుక్కలు ఓ పాడి ఆవు వెంట బడి తీవ్రంగా గాయపరిచాయి. పాడి ఆవును పట్టుకు పోతున్న రైతుపైనే వీధి కుక్కలు తిరగబడ్డాయి. దీంతో సమీప ప్రజలు కట్టెలతో కుక్కలను తరమడంతో పారిపోయాయి. అనంతరం స్థానిక పశువైద్యశాలలో గాయపడ్డ పశువుకు చికిత్సలు కల్పించారు. సోమల పంచాయతీలో వీధికుక్కల బెడద నివారణకు పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గంగవరం అర్బన్ సీఐగా చిన్నగోవిందు



గంగవరం, ఫిబ్రవరి 4 : గంగవరం అర్బన్ సీఐగా టి.చిన్నగోవిందు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం దిశ పోలీస్ స్టేషన్‌లో సీఐగా పని చేస్తున్న టి.చిన్నగోవిందును గంగవరం అర్బన్ సీఐగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సీఐగా బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. గంగవరం మండలపరిధిలో శాంతి భద్రతలను కాపాడడానికి నిష్పక్షపాతంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పలమనేరు, ఫిబ్రవరి4 : పలమనేరులో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, వేమన పద్య అనుబంధ పుస్తకాలను ఇందూ జ్ఞానవేదిక సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఆధ్యాత్మికతపై అవగాహన కల్పించారు. అలాగే వేమన పద్యాల్లోని జ్ఞానాన్ని కూడా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజి, సభ్యులు రాజేంద్ర, జీవరత్నం, వింద్య వాణిశ్రీ, జ్యోతి, హేమంత్, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్ ఆవిష్కరణ

కుప్పం, ఫిబ్రవరి 4: కుప్పం వైసీపీ కార్యాలయంలో సిద్ధం పోస్టర్‌ను ఎమ్మెల్సీ భరత్ నేతృత్వంలో విడుదల చేశారు. ఈనెల 11న అనంతపురంలో జరగనున్న సిద్ధం బహిరంగ సభకు కుప్పం నుంచి 15 వేల మందిని తోలేందుకు ప్రణాళిక చేశామన్నారు. అందులో భాగంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల నేతలతో సమీక్ష జరిపారు.

తిరిగి వైసీపీ గూటికి మఠం సర్పంచ్, ఎంపీటీసీ

కుప్పం, ఫిబ్రవరి 4: శాంతిపురం మండలం మఠం సర్పంచ్ మురళి, ఎంపీటీసీ చంద్ర తిరిగి ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసీపీ గూటికి చేరుకున్నారు. ఆదివారం కుప్పం వైసీపీ కార్యాలయంలో వారికి వైసీపీ కండువాలు కప్పి ఎమ్మెల్సీ భరత్ పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం టీడీపీ ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ నేతృత్వంలో టీడీపీలో చేరిన వారిని అధికార నేతలు ఎలాగోలా ఒప్పించి తిరిగి సొంత గూటికి రప్పించుకోగలిగారు.

టీడీపీ ఆర్థిక సాయం



రామకుప్పం, ఫిబ్రవరి 4 చిక్కపల్లెతాండాకు చెందిన తెలుగు మహిళ నేత సుమిత్రమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, మాజీ అధ్యక్షుడు బాలాజీనాయక్, నేతలు నందారెడ్డి, టీవీరవి, జేయి, భూపతి. వెంకటేష్ తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులరించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

వేమన పద్యాల్లో ఆత్మ జ్ఞానం

శాంతిపురం, ఫిబ్రవరి 4 : వేమన పద్యాల్లో ఆత్మజ్ఞానం కలిగి ఉందని శివరామపురం త్రైతసిద్ధాంత-ప్రబోధ సేవాసమితి ఇందూజ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు ఆదివారం సోమాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నేటి తరానికి వేమన పద్యాలకు జ్ఞాన ఆవశ్యకత ఎంతో ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, నాగరాజు, ప్రకాష్, కృష్ణన్న, చరణ్, వెంకటలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం అన్నారు. ఆదివారం డ్రైవర్ల సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎదుర్కొంటున్న బదిలీల సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం మదనపల్లి డివిజన్ డ్రైవర్ల సంఘం నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగరాజు, కృష్ణారెడ్డి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా లక్ష్మీనారాయణుల కల్యాణం



మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన ఏడుకొండల రాయుడిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో పనిచేస్తున్న గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి దళితవాడకు చెందిన కన్నయ్య, నక్షత్రమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారిని పట్టువస్త్రాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చిత్తూరులో ఆదివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ జాషువాకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న జిల్లా పోలీసు అధికారులు

చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఫిబ్రవరి 4: చిత్తూరు సబ్‌డివిజన్ డీఎస్పీగా ఎం. రాజగోపాల్ రెడ్డి ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా రేవనూరు గ్రామానికి చెందిన ఈయన 1991 బ్యాచ్‌లో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. మొదటి పోస్టింగులోనే చిత్తూరుజిల్లాలో పనిచేశారు. ఎస్ఐగా పలు చోట్ల పనిచేసి, సీఐగా పదోన్నతి పొంది కుప్పం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విధులు నిర్వహించారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొంది రాయలసీమ జిల్లాలోని నాయుడుపేట, గూడూరులలో విధులు నిర్వహించి, బదిలీల్లో భాగంగా చిత్తూరు డీఎస్పీగా వచ్చారు. అనంతరం ఎస్పీ జాషువా, ఏఎస్పీ ఆరీఫుల్లాలను మర్యాదపూర్వకంగా కలిశారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న డీఎస్పీ

ఐరాల(కాణిపాకం): చిత్తూరు నూతన డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా మునీశ్వరుడికి మహాకుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న గ్రామస్తులు

గుడిపాల, ఫిబ్రవరి 4: మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామంలో రచ్చబండపైన నూతనంగా నిర్మించిన మునీశ్వరుడికి ఆదివారం పురోహితులచే వైభవంగా భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, గ్రామస్తులు కేపీ బాబు, నాగేష్ నాయుడు, జయరాం నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, సాంబశివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు సన్మానం




తహసీల్దార్ ఇన్బనాథన్‌కు సన్మానం చేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: గంగాధరనెల్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఇన్బనాథన్ అన్నమయ్య జిల్లా రాజంపేట తహసీల్దార్‌గా మూడురోజుల క్రితం బదిలీ అయ్యారు. ఈసందర్భంగా గంగాధరనెల్లూరు రెవెన్యూ కార్యాలయంలో ఇన్బనాథన్‌ను పలువురు నేతలు, అధికారులు ఆదివారం సన్మానించారు. నేతలు చిన్నమరెడ్డి, నరసింహులు నాయుడు, వెంకటరెడ్డి, బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, విజయసింహారెడ్డి, శ్రీనివాసన్, తులసిరామ్, రవీంద్రారెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

తవణంపల్లె, ఫిబ్రవరి 4: ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో రమణ ప్రకాష్ సిబ్బందికి సూచించారు. ఆదివారం మండలంలోని జొన్నగురకల, అరగొండ, దిగువమాఘం, టి.పుత్తూరు, తవణంపల్లె, నల్లిశెట్టిపల్లె తదితర సచివాలయాల్లో జరుగుతున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీవో తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నేడు నగరపాలక కార్యాలయంలో
స్పందన కార్యక్రమం

చిత్తూరు, ఫిబ్రవరి 4: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. నగరంలో సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నేత మృతికి పలువురి నివాళి

నగరి, ఫిబ్రవరి 4: నగరి పట్టణ పరిధిలోని సత్రవాడకు చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యం మృతి చెందడంతో ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కర్ణ, అశోక్, టీడీపీ నాయకులు ఉన్నారు.

జయరాం కుటుంబానికి అండగా ఉంటా



పరామర్శిస్తున్న చంద్రప్రకాష్ తదితరులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 4: చిత్తూరు రూరల్ మండలం పెద్దిశెట్టిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ జయరాం శనివారం మృతి చెందారు. ఆదివారం జయరాం కుటుంబాన్ని జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ పరామర్శించారు. కుటుబానికి టీడీపీ, తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. జయరాం మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు, రాజేంద్రన్, కాశి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేశమ్మ ఆలయ కుంభాభిషేకం

నగరి, ఫిబ్రవరి 4: నగరి పట్టణ పరిధిలోని టీఆర్‌కండ్రిగ వద్ద గల నేత్ర దేవత దేశమ్మ ఆలయం నూతనంగా నిర్మించారు. మంత్రి రోజా సహకారంతో నిర్మించిన ఈ ఆలయానికి ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వేణుబాబు పేర్కొన్నారు. 5వ తేది సోమవారం సాయంత్రం గోపూజ, మహాగణాధిపతి పూజతో ప్రారంభమై 8వతేది గురువారం జలాధివాసంతో ముగుస్తుందని తెలిపారు. ఆదివారం సాయంత్రం మంత్రి రోజా కుంభాభిషేకం ఏర్పాట్లను పరిశీలించారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊట్ల నాగరాజులు నాయుడు, హేమాద్రి నాయుడు, ఏకాంబరం, దాము, బాలాజీ, వీరభద్రయ్య, హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనదొడ్లలో లే అవుట్ల రిజిస్ట్రేషన్లు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4: పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలోని లే అవుట్లలోని లబ్ధిదారుల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపట్టామని ఆదివారం సచివాలయ డీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం బొమ్మనదొడ్ల లే అవుట్‌లోని వారికి రిజిస్ట్రేషన్లు చేశామని ఆయన తెలిపారు.

మహిళా వాలీబాల్ విజేత జట్టుకు సన్మానం



మహిళా క్రీడాకారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో బోడబండ్ల గ్రామానికి చెందిన మహిళా వాలీబాల్ జట్టు మండలస్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి పోటీల్లో రెండవస్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ యువకులు కోదండరాముడి గుడి వద్ద మహిళా జట్టు సభ్యులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, పట్టాభి, గిరి, జగదీష్ యాదవ్, మోహన్, జ్యోతీశ్వర్ నాయుడు, గోపి నాయుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత హిందీ ప్రచారసభ
సభ్యుడిగా ఎల్బీ మహేశ్‌నారాయణ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి4: దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఉమ్మడి రాష్ట్రాల కార్యవర్గ సభ్యుడిగా పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎల్బీ మహేశ్ నారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన దక్షిణభారత హిందీ ప్రచార సభ్యుల సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. అందులో 18మంది కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేయగా అందులో తనకు అవకాశం లభించిందన్నారు. విషయం తెలుసుకున్న పుంగనూరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ భవన నిర్మాణం
పూర్తి చేయరా?



అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనం

కార్వేటినగరం, ఫిబ్రవరి 4: మండలంలోని సీడీ కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని కోదండ రామాపురంలో అంగన్వాడీ భవన నిర్మాణం గత మూడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. మోల్డింగ్ దశ వరకు వచ్చిన భవన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కోదండ రామాపురంలో అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేకపోవడంతో తాత్కాలికంగా ఒక భవనంలో కొనసాగిస్తున్నారు. భవన నిర్మాణం సకాలంలో పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవడంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు విఫలం అయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లిలో నిర్వహించనున్న రా.. కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సభను విజయవంతం చేయడానికి పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, వార్డు స్థాయి నాయకులందరూ కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా రత్నం, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు వైవీ రాజేశ్వరి, చంద్రప్రకాష్, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, సుబ్రమణ్యం నాయుడు, సీఎం విజయ, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

రా... కదలి రా సభకు తరలిరండి

పూతలపట్టు: రా... కదలిరా... కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూతలపట్టు టీడీపీ కార్యాలయంలో మండల నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఓ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, కార్యక్రమ పరిశీలకుడు శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, గురుస్వామి, గణపతి నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, ఏకాంబరం, కాంతారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: రా... కదలిరా కార్యక్రమానికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్, నియోజకవర్గం పార్టీ పరిశీలకులు బొమ్మన శ్రీధర్ పిలుపునిచ్చారు. తవణంపల్లె టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, జనసేన మండల అధ్యక్షుడు శివ, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మండల పార్టీ ప్రధానకార్యదర్శి మధు, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా కృషి చేయాలని ఆమె నాయకులకు సూచించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బాలాజీ నాయుడు, రాజశేఖర్ నాయుడు, ఎస్. కుమార్, బాబు నాయుడు, నిరంజన్‌రెడ్డి, దొడ్డ హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని 13 పంచాయతీల్లోని గ్రామాల్లోని ఇంటింటికీ టీడీపీ నాయకులు వెళ్లి రా.. కదలిరా సమావేశానికి ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు తప్పకుండా రావాలని కోరారు. జన సమీకరణ చేయడానికి నాయకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ నాయకులు వాసు నాయుడు, శేఖర్ నాయుడు, వెంకటేశులు నాయుడు, నవీన్, కేశవులు నాయుడు, సాంబశివన్, అరుళ్‌నాథన్, తంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పూతలపట్టులో, శ్రీరంగరాజపురంలో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న టీడీపీ నేతలు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 50 కుటుంబాలు



భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నగరి, ఫిబ్రవరి 4: నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడ నుంచి సుమారు 50 కుటుంబాల సభ్యులు డి.బాబు, అలెక్స్, కార్తవరాయన్, శివ, వెంకటన్, ఆర్ముగం, మునస్వామి, వవి, మురుగేష్, శాంతి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో భానుప్రకాష్ సమక్షంలో ఆదివారం చేరారు. వైసీపీ పాలనలో దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేయడమే కాకుండా నిరంతరం రాష్ట్రంలో దళితులపై దాడులు చేయడం జరుగుతోందని, టీడీపీలోనే దళితులకు న్యాయం జరుగుతోందని ఆపార్టీలో చేరుతున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. భానుప్రకాష్‌తో తమకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. భానుప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ వస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని, అందరు సమష్టిగా నగరిలో టీడీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్ బాబు, రాష్ట్ర మహిళా టీడీపీ అధికార ప్రతినిధి మీరా, చిత్తూరు పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

● మండల సమావేశంలో సభ్యుల వినతి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం, ఫిబ్రవరి 4: మండలంలో రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రానీయకుండా చర్యలు చేపట్టాలని మండల సమావేశంలో సభ్యులు కోరారు. ఆదివారం పాలసముద్రం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ శ్యామల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సంబంధిత శాఖల అధికారులు వివరించారు. పాలసముద్రం కాలనీలో తాగునీటి సమస్య వుందని, అక్కడ అదనపు బోరు వేయించాలని ఎంపీటీసీ గోవిందరాజులు కోరారు. పీహెచ్‌సీకి కావాల్సిన మందులను దాతల సహకారంతో అందచేస్తామని డాక్టర్ మోహనకృష్ణకు ఎంపీపీ తెలిపారు. కావాల్సిన మందుల వివరాలను తనకు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని చెరువుకాలువల్లో ముళ్ళకంపలు, పూడికలను తీసివేయించాలని సభ్యులు కోరారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామనాథరెడ్డి, ఎంపీటీసీలు పుష్ప, శేఖర్, జగన్నాథరాజు, కుప్పమ్మ, సర్పంచ్‌లు, ఏఈలు మునిరాజ్, దాము, చీరాలయ్య, ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఏపీవో మార్గరెట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా కమిటీలను పటిష్ఠం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ మహిళా జిల్లా నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 4: బీజేపీ మహిళా కమిటీలను పటిష్ఠం చేయాలని మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీవీ జయ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు భువనేశ్వరి ఆధ్వర్యంలో శక్తి వందన్ వర్క్‌షాప్, జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జయ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ మహిళా మోర్చా శక్తిని నిరూపించుకునేందుకు బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి ప్రయోజనాలు, పొందుతున్న లబ్ధి వివరాలను వివరించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహిళలను బీజేపీ వైపు వచ్చేలా వారిలో చైతన్యం నింపాల్సిన బాధ్యత ప్రతి మహిళా కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, రాష్ట్ర ఎస్‌హెచ్‌జీ, ఎన్‌జీవో కో కన్వీనర్లు పుష్పలత, నాయకులు లక్ష్మమ్మ, కవిత, రాజు, చంద్రకళ, శాంతిశ్వరి, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 4: స్థానిక గంగనపల్లెలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని డీఎస్ ఫోర్స్ నగర కన్వీనర్ డి. లోకేష్ భరణి ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో నిర్వహించారు. రోగులకు ఈసీజీ, క్యాన్సర్, బీపీ, షుగర్, కంటి రోగులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. వీరందరికీ డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పూత రాని మామిడి

● ఆందోళనలో రైతులు



విజయపురం మండలం కేశవపురం వద్ద పూత కనిపించని మామిడి

విజయపురం, ఫిబ్రవరి 4: మామిడి చెట్లకు పూత సక్రమంగా రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి పూత కోసం ఇప్పటికీ ఒక పర్యాయం మందులు పిచికారి చేశామని, ఆశించిన స్థాయిలో పూత రాలేదని రెండవ పర్యాయం కూడా మందులు పిచికారి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉండగా, జగన్నాథపురం, క్షూరికాపురం, విజయపురం, కోసలనగరం, పాతార్కాడు, జంబాడ, మహారాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డి కండ్రిగ, నారపరాజు కండ్రిగ పంచాయతీల్లో మామిడిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 2200 ఎకరాల్లో తోతాపురి, బంగినపల్లి, రుమాని, కాలేపాడు, సింధూర వంటి రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మంచు ఎక్కువగా కురవడం వలన పూత తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత రావడానికి ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

మంచు తీవ్రత వలన పూత తగ్గింది



- మురళీకృష్ణారెడ్డి, మామిడిరైతు, విజయపురం

మంచు తీవ్రత పెరగడం వలన మామిడిలో పూత తగ్గింది. తేలిక పాటి పూత వచ్చినా పొగ మంచు వలన పేనుబంక తెగులు సోకి పూత రాలిపోతుంది. ఈ విషయమై రైతులకు అధికారులు సూచనలివ్వాలి.

రెండు పర్యాయాలు మందులు పిచికారి చేశా



- హరికృష్ణ, మామిడి రైతు, కోసలనగరం

మామిడిలో పూత కోసం రెండు పర్యాయాలు మందులు పిచికారి చేశాను. 50 శాతం మామిడి చెట్టులో కూడా పూత సక్రమంగా కనిపించడం లేదు. పిచికారి చేసిన మందులు పనిచేయడం లేదా... కొత్త రకం మందులు పిచికారి చేయాలా అర్థం కావడం లేదు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పన్నీర్‌సెల్వం

చిత్తూరు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం అన్నారు. ఆదివారం డ్రైవర్ల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎదుర్కొంటున్న బదిలీల సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రతా జాగ్రత్తలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పాత వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీచేయాలని కోరారు. అనంతరం మదనపల్లి డివిజన్ డ్రైవర్ల సంఘం నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగరాజు, కృష్ణారెడ్డి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో ఆత్మ జ్ఞానం

శాంతిపురం, ఫిబ్రవరి 4: వేమన పద్యాల్లో ఆత్మజ్ఞానం కలిగి ఉందని శివరామపురం త్రైతసిద్ధాంత-ప్రబోధ సేవాసమితి ఇందూజ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు ఆదివారం సోమాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నేటి తరానికి వేమన పద్యాలకు జ్ఞాన ఆవశ్యకత ఎంతో ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, నాగరాజు, ప్రకాష్, కృష్ణన్న, చరణ్, వెంకటలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

భయం, ఒత్తిడి వదిలేస్తే 'పది'లో ఉత్తమ ఫలితాలు

శాంతిపురం, ఫిబ్రవరి 4: పదో తరగతి పరీక్షల్లో భయం, ఒత్తిడి వదిలేస్తే ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తొలిసినాయనపల్లె వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 440మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలు ఎలా రాయాలి, ఏవిధంగా రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చో అవగాహన కల్పించారు. తరువాత విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. లత, వెంకటయ్య, నగేష్, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.